

ఏలూరులో భోగి వేడుకల్లో ఎమ్మెల్యే బడేటి

వాడవాడలా భోగి మంటలు

ఏలూరుసిటీ/ఏలూరుటూటౌన్/పెదవేగి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలో తొలి రోజు భోగి పండుగను జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సోమవారం వేడుకగా నిర్వహించారు. తెల్లవారుఝామునే భోగి మంటలను వాడవాడలా వేసుకుని భోగి పండుగకు ఘనంగా స్వాగతం పలికారు. సాయంత్రం ఇళ్ల వద్ద చిన్నారులకు సందె గొబ్బెమ్మలు, భోగిపండ్ల పేరంటాలను నిర్వహించారు. వైష్ణవ దేవాలయాల్లో గోదాదేవి కల్యాణాలను నిర్వహించారు. ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటి క్యాంపు కార్యాలయం వద్ద భోగి మంటలను ఆయన ప్రారంభించారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో దెందులూరు చింతమనేని ప్రభాకర్ సోమవారం తెల్లవారుజామున భోగిమంట వేసి వేడుకలను ప్రారంభించారు.



దుగ్గిరాలలో భోగిమంట వెలిగిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు కోడిపందేల బరి వద్ద బుల్లెట్‌లు

విజేతలకు బుల్లెట్‌లు..

కొయ్యలగూడెం/ముదినేపల్లి/మండవల్లి/కైకలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ పందేల్లో విజయం సాధించిన వారికి బుల్లెట్లు బహుమతులు ఇచ్చారు. కొయ్యలగూడెం మండలం రామానుజపురం మూడు పందేల్లో రెండు గెలిచిన వారికి బుల్లెట్ బహుమతిగా ప్రకటించారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులోని ఓబరిలో ఐదు పందేలకు మూడు పందేలు గెలిచిన సుధీర్ అనే వ్యక్తి బుల్లెట్‌ను కైవసం చేసుకున్నాడు. పెదపాలపర్రు బరిలో గుడివాడకు చెందిన ఎన్‌ఆర్‌ఐ సునీల్, వడాలి బరిలో ఏడు పందేల్లో పాల్గొని నాలుగు పందేలు గెలిచిన భీమవరానికి చెందిన విజయ రాజు బుల్లెట్‌లను కైవసం చేసుకున్నారు. మండవల్లి మండలం భైరవపట్నంలో అధిక పందేలు గెలిచిన కైకలూరు మండలం భుజబల పట్నంకు చెందిన శివాజీరాజుకు ఎలక్ట్రికల్ మోటార్‌సైకిల్‌ని అందజేశారు. కైకలూరు మండలం భుజబలపట్నంలో 11 జోడాల కోడి పందేలకు ఆరు పందేలు గెలిచిన వారికి బుల్లెట్ బైక్‌ను బహుమతిగా అందజేశారు.

చావలిపాడులో పొట్టేలు పోటీలు

మండవల్లి : చావలిపాడులో పొట్టేలు పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కర్నాటక రాష్ట్రాలకు చెందిన సుమారు 150 పొట్టేళ్లను పోటీలకు తీసుకొచ్చారు. ఈ మేరకు సోమవారం రెండు పందేలు నిర్వహించారు. మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ఎక్కువ సంఖ్యలో పోటీలు నిర్వహించనున్నారు.





కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో కోడి పందేలు తిలకిస్తున్న ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్

నరసింహారావుపాలెంలో టీడీపీకి 200 మంది రాజీనామా

చాట్రాయి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి పార్థసారథి అనుసరిస్తున్న తీరుకు నిరసనగా నరసింహారావుపాలెంలో 200 మంది తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు సోమవారం పార్టీకి రాజీనామా చేశారు. సోమవారం నరసింహారావుపాలెంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు అందే కృష్ణ, పార్టీ నాయకుడు చింతల మోహనరెడ్డి, కార్యకర్తలు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గ్రామ టీడీపీ సమావేశం జరిపి మోహనరెడ్డిని పీఏసీఎస్ అధ్యక్ష పదవికి నామినేట్ చేయాలని తీర్మానించామని, కానీ మంత్రి ఆ నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కొత్తగా పార్టీలోకి వచ్చిన వ్యక్తిని నామినేట్ చేయడంతో తాము మనస్థాపానికి గురై రాజీనామా చేస్తున్నామన్నారు. అధికారం చేపట్టిన దగ్గర నుంచి మంత్రి తమకు విలువ, గుర్తింపు ఇవ్వడం లేదని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



రాజీనామా లేఖలు చూపిస్తున్న టీడీపీ శ్రేణులు

ఏటీఎంలు ఖాళీ



పండుగ పేరిట జనం పెద్ద ఎత్తున నగదును డ్రా చేశారు. భోగి పండుగ రోజు మధ్యాహ్నం ఒంటిగంట సమయానికే అనేక ఏటీఎంలు నగదు లేక మూతపడ్డాయి. ప్రత్యేకించి ఫోన్‌పే, గూగుల్‌పేలలో నగదు లావాదేవీలు చోటు చేసుకున్నాయి. పరస్పరం పందేలకు దిగితే అలాంటి వారంతా ఫోన్‌పేను ఉపయోగించుకునే ప్రయత్నం చేశారు. ఎక్కడా నగదు కనిపించకుండా మరికొందరు జాగ్రత్తలు పడ్డారు.



భీమడోలు మండలం గుండుగొలను బరిలో తలపడుతున్న పందెంకోళ్లు

కోఢీ..



కామయ్యపాలెంలో కోడి పందేలు ప్రారంభిస్తున్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ఊరూవాడా బరులు.. కత్తులు దూసిన కోళ్లు

- చెలరేగిపోయిన కోడి పందెంరాయుళ్లు
- తొలిరోజే చేతులు మారిన లక్షలు
- బరుల వద్దే పేకాట, గుండాట
- బెట్టింగ్‌రాయుళ్లను ఆకర్షించేలా ఖరీదైన బహుమతులు

సంక్రాంతి పండుగ వేళ పందెం పుంజులు కత్తికట్టి మరీ బరిలోకి దిగాయి. వేలాది మంది పందెం రాయుళ్ల సమక్షంలో తెగ చెలరేగిపోయాయి. పోలీసుల ముందస్తు హెచ్చరికలు బేఖాతరయ్యాయి. ఎక్కడికక్కడ కోడి పందేలు, సమాంతరంగా గుండాట, పేకాట జోరుగా సాగాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోను భోగి పండుగ నాడే పందేలతో దద్దరిల్లేలా చేశారు.



కామడవోలులో కోడి పందేల వద్ద యువత సందడి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సంక్రాంతి అంటేనే సంప్రదాయం. కాని సమాంతరంగా కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూదాలు తెర మీదకు వచ్చాయి. ఈ ఏడాదీ ముందుగా ఊహించినట్టే ఊరూవాడా పెద్ద సంఖ్యలో కోడి పందేల బరులు వెలిశాయి. అన్ని పార్టీల నేతలు వీటికి నేతృత్వం వహించారు. ఇంతకుముందు కోడి పందేలన్నీ వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఏకపక్షంగా సాగాయి. ఈసారి కూటమి పక్ష నేతలతో పాటు మిగతా పార్టీ నేతలు ఎక్కడికక్కడ కోడి పందేల బరులు నిర్వహణకు ముందుకు వచ్చారు. కోడి పందేలు వేయరాదని, పేకాట, జూదం సహించబోమని పోలీసులు వార్నింగ్ ఇచ్చినా బేఖాతర్ చేశారు. భోగి పండుగ రోజు సోమవారం ఉదయం 11 గంటలకే దాదాపు జిల్లా అంతటా బరుల్లో పందెం కోళ్ళు తలపడ్డాయి. ఎక్కడికక్కడ పేకాట, గుండాట శిబిరాలు వెలిశాయి. ఏలూరు నగరంలోను కోడి పందేలు సాగాయి. గతంలో ఏలూరు శివారు బరుల్లో రూ.50 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు పందేలు సాగగా, ఈసారి అది రూ.మూడున్నర లక్షల వరకు పెరిగింది. హైదరాబాద్ తదితర ఇతర ప్రాంతాల నుంచి కోడి పందేలపై ఆసక్తితో వచ్చిన వారంతా పందెం గెలిచేందుకు నోట్ల కట్టలను విసిరారు. జిల్లా వ్యాప్తంగా నూజివీడు, కైకలూరు, ఏలూరు, దెందులూరు, చింతలపూడి, పోలవరం, ఉంగుటూరు వంటి నియోజక వర్గాలన్నింటిలో పందేలు జోరుగా సాగాయి. పందేల్లో చనిపోయిన పందెం కోడి కోజా ఏలూరు సమీపంలోని పందెం బరుల్లో రికార్డు స్థాయిలో రూ.ఆరు వేల నుంచి రూ.15 వేల వరకు ఒక్కో పుంజు అమ్ముడుపోయింది. ద్వారకాతిరుమల మండలంలో ఒక్కో కోజా రూ. 3000 నుంచి రూ.5000 వరకు పలికింది. దెందులూరు నియోజకవర్గంలో జరిగిన కోడి పందేలే ఈసారి హైలెట్‌గా నిలిచాయి. ఎక్కడా తేడా జరగకుండా పాస్‌లు ఇచ్చి మరీ ప్రజలను, అతిథులను బరిలోకి పంపారు. అక్కడే వారందరికీ ఆహార ఏర్పాట్లు చేశారు.

పేకాట.. గుండాటలతో కవ్వింపు

పందేల బరుల వద్ద గుండాట, పేకాట శిబిరాలు వెలిశాయి. కోసాట(పేకాట) వైపే అత్యధికులు మొగ్గు చూపారు. ప్రతి పందెం బరిలోను లక్షల రూపాయలు చేతులు మారాయి. ప్రత్యేకించి ఇది తొలి రోజు ఇంకా రెండు



భీమడోలు మండలం గుండుగొలనులో కోడిపందేల వద్ద కోతాట

రోజులు మిగిలే ఉన్నాయంటూ జూదరులు తెగ రెచ్చిపోయారు. కోసాటల్లో ఒక్క రౌండ్‌లోనే రూ.70 వేల నుంచి రూ.మూడు లక్షల వరకు పందేలకు దిగారు. గుండాట శిబిరాల్లో కుర్రకారు జోష్ అంతాఇంతా కాదు.

ఎక్కడ పోలీసులు అక్కడ గప్‌చిప్..

ఏలూరు క్రైం : జిల్లాలో ఈ ఏడాది కోడి పందేలు నిర్వహిస్తే రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని గత ఇరవై రోజుల నుంచి జిల్లా పోలీస్ శాఖ హెచ్చరించింది. పందేల నియంత్రణకు ఒ రెవెన్యూ, పోలీస్ యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. అయితే భోగి రోజు సోమవారం జిల్లావ్యాప్తంగా యథేచ్ఛగా పందేలు సాగాయి. ఉదయం 9 గంటల నుంచి జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో పోలీసులు ఒకరో ఇద్దరో మినహా ఎవ్వరు కనిపించలేదు. అంతా విధుల్లో ఉన్నారంటూ చెప్పుకోవడం విశేషం. మరో వైపు పోలీస్ సిబ్బంది, అధికారులు కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ జరుపు కోండి అనే సంకేతం పోలీసు శాఖకు అందినట్లు తెలుస్తోంది. జిల్లాలో 25 ఏళ్లగా పరిశీలిస్తే ఇద్దరు ఎస్పీలే పందేలను నియంత్రించగలిగారు. 2001లో అప్పటి ఎస్పీ అభయ త్రిపాఠి ఉజేలా, 2005లో ఎస్పీ నరసింహమూర్తి పందేలను నియంత్రించగలిగారు.

• నేతల చేతుల మీదుగా ప్రారంభం

కోడి పందేలను ఎక్కడికక్కడ స్థానిక ఎమ్మెల్యేల చేతుల మీదుగానే ప్రారంభించారు. పోలవరం నియోజకవర్గంలో పలు చోట్ల పందేలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దగ్గరుండి మరీ ప్రారంభించారు. మిగతా ఎమ్మెల్యేలంతా ఎక్కడికక్కడ పందేల వీక్షణకు తరలి వెళ్లారు. మాదేపల్లి, రామానుజపురంల్లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఎంపీ మహేశ్ పాలు పంచుకున్నారు.

పూటుగా తాగి.. ఫుల్లుగా భోంచేసి



బయ్యన్నగూడెంలో ఘర్షణ

సంక్రాంతి పండుగలో భాగమైన భోగినాడు మద్యం, మాంసంకు కొందరు దూరంగా ఉంటారు. ఈసారి మాత్రం కోడి పందేల్లో నిర్వాహకులే పెద్ద ఎత్తున బిర్యానీ పాయింట్లు తెరిచారు. దీంతో పాటు మద్యం విక్రయాలు ఎడాపెడా సాగాయి. కొందరేమో మద్యం దుకాణాల నుంచి కొనితెచ్చుకోగా, కొందరు చాటుమాటుగా అమ్ముతున్న కొందరి నుంచి అత్యధిక ధరకు కొనుగోలు చేసి మరీ తాగేశారు. చికెన్ పకోడి కోసం జనం ఎగబడ్డారు. కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం పందేల్లో స్వల్ప వాగ్వాదం ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారి తీయడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి గొడవ సర్దుబాటు చేశారు. సుమారు రెండు గంటలపాటు పందేలు నిలిపివేశారు.

రోడ్లకు సంక్రాంతి

◆ ఆర్‌అండ్‌బీ రోడ్లకు సంక్రాంతి శోభ వచ్చింది. గుంతలతో నిండిన రోడ్లకు మరమ్మతులు వేగవంతంగా జరుగుతుండడంతో పండుగకు వచ్చే వారి ప్రయాణం సుఖవంతంగా జరుగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి గత పండుగకు వచ్చినప్పుడు రోడ్లు ? ఈ ఏడాది పండుగకు వచ్చినప్పుడు రోడ్లు ఎలా ఉన్నాయి ? తేడా గమనిస్తున్నారు.

ఏలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతిని జోష్‌గా జరుపుకునేందుకు వీలుగా పల్లె, పట్నం రోడ్లు అభివృద్ధి బాటలో పడ్డాయి. దీంతో ఊరు, నగరం అనే తేడా లేకుండా కార్లు, ద్విచక్రవాహనాలు, భారీ వాహనాలు రయ్యమంటూ తమ స్వస్థలాలకు చేరాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో గుంతలు పడ్డ రోడ్లను కనీసం పూడ్చేందుకు కూడా ఉపక్రమించలేదు. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన నాటి నుంచి రెండు నెలలు ప్రణాళిక, 100 రోజుల ప్లాన్ తదితర సూక్ష్మస్థాయి ప్రణాళికలతో రోడ్లకు మహర్దశను పట్టించారు. సంక్రాంతికి డెడ్‌లైన్‌గా పనులు చేయాలని రంగం సిద్ధం చేయగా, దాదాపుగా 80 నుంచి 90 శాతం వరకు పనులు పురోగతిలో పడ్డాయి. ఏలూరు జిల్లాలో గుంతలు పడిన రోడ్ల మరమ్మతులకు మొదటి విడతగా 948 పనులు గుర్తించగా రూ.22 కోట్లతో పనులు చేపట్టి వాటిలో 700 వరకు పూర్తి చేశారు. పండుగ సెలవుల అనంతర మిగిలిన పది రోజుల్లో ఇవి పూర్తయ్యే అవకాశం ఉంది. పల్లె పండుగ పేరిట జిల్లాలో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా 1,062 పనులు పూర్తి చేయడానికి అధికారులు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద పొలం పుంతలను, డొంకరోడ్లకు మరమ్మతులు చేపట్టారు. రోడ్లు, భవనాలశాఖకు చెందిన 158 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రోడ్ల బాగుచేత పురోగతిలో ఉంది. రెండో విడతగా 123 పనులను రూ.75.16 కోట్లతో 523 కిలోమీటర్ల పూర్తి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇవి పూర్తయేల్లోగా పల్లెలు, పట్టణాల్లో సిమెంట్ కాంక్రీట్ రోడ్లకు శ్రీకారం చుట్టనుంది. ఏలూరు నగరంలోని రోడ్లపైనా దృష్టి పెట్టారు.

మొదటి విడత
రూ.22 కోట్లతో 948 పనులు
ఇప్పటికే 700 వరకు పూర్తి
నెలాఖరుకు మొత్తం పూర్తి
రెండో విడతలో రూ.75.16 కోట్లతో 123 పనుల గుర్తింపు
పండుగ ప్రయాణం సుఖమయం.. జనం హర్షం



అభివృద్ధి చేసిన ఏలూరు-చింతలపూడి రోడ్డు

సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి...ఊరు వాడా చిన్నా పెద్దా అంతా సందడి సందడి చేశారు.. తెలవారకుండానే గ్రామాల్లో భోగిమంటలు వెలిగాయి.. చిన్నారులు గొబ్బెమ్మల పెట్టుకుని ఆటలాడారు.. యువత కొత్త బట్టలేసుకుని ఊర్లన్నీచుట్టి వచ్చారు... ఆడవాళ్లు వంటల్లో బిజీగా గడిపారు.. ఆనక తీరిగ్గా ముచ్చట్లు పెట్టుకున్నారు.. సంక్రాంతి సంబరాల పేరిట వివిధ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు.. గ్రామాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి.. ఆలయాల్లో గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.. ఎక్కడెక్కడో ఉన్న ఫ్రెండ్స్ అంతా గెట్ టు గెదర్ పేరిట మీట్ అయ్యారు... భోగి పండగ సందడి సందడిగా సాగింది....



ఊరంతా పండగ



ఏలూరులో భోగి మంటలు



ఇవి సంప్రదాయ క్రీడలా !

సంప్రదాయ క్రీడలు, పండుగలు అనే పదము 21వ శతాబ్దం నుంచి వాడుతున్నారు. అంతకు ముందు ఈ పదము మనుగడలో లేదు. సంప్రదాయము అనగా భారతీయ హిందూ సంప్రదాయం. గత కొంత కాలంగా మతాలు, మతాభిమానులు పరిపాలించే ప్రభుత్వాలను నిలదీస్తున్నాయి..మా మతంలో ఉన్న సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించుకుంటామని డిమాండ్ చేస్తున్నాయి. కుల, మత వర్గాలను పెంచి పోషించేవి రాజకీయ నాయకులే కదా ! కుల మతాలను రాజకీయ నాయకులు వదిలేస్తే కొంతకాలానికి ప్రజలు వదిలేస్తారు. ఓట్ల రాజకీయం, నోట్ల రాజకీయం ఉన్నంతకాలం, కులాలు, మతాలు కొనసాగుతూనే ఉంటాయి. వాటి తాలూకా సంప్రదాయాలూ కొనసాగుతాయి.అటవిక జీవితాలు కొనసాగించే ఆ కాలంలో కోడి పందేలు, గొర్రెపొట్టేల పందాలు, కుక్కలు, నక్కలు, పందులు, పశువులు,చాలా రకాల ప్రాణులతో చివరకు మనుషులతో సహా పందేలు నిర్వహించేవారు.. అప్పటికి గ్రహించిన వినోద కార్యక్రమాలు అవి... ఈ రోజున ఉన్నంత టెక్నాలజీ, వినోదం ఆనాడు లేకపోవడంతో జీవరాసుల పందేలు ఒక క్రీడగా ఎంచుకుని కాలక్షేపం చేసేవారు. అవి విజ్ఞానం పెరగని ఆనాటి క్రీడలు. ఇప్పుడు కోడిపందేలు, పేకాట, గుండాట ఇలాంటి జూదాలన్నీ సంప్రదాయ క్రీడలు అంటున్నారు. ప్రజా క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని జంతు క్రీడలు, జూద క్రీడలు నిర్వహించవద్దని న్యాయస్థానాలు హెచ్చరికలు చేస్తున్నది. అది సమాజ శ్రేయస్సు కోసమే...

– గుగ్గిలపు ముత్యాలరావు, పాలకొల్లు



ఇంకా ఉంది.. పండక్కు వస్తున్న ప్రయాణికులతో భీమవరం రైల్వేస్టేషన్లో సందడి..



కొవ్వలిలో సోదెమ్మల వేషధారణలు



సంప్రదాయ వృత్తి పనుల ప్రదర్శనలో యువతులు



ద్వారకాతిరుమల కొండపై సంక్రాంతి సంబరాల్లో గ్రామీణ నేపథ్యం



కొవ్వలిలో జరిగిన వేడుకల్లో గోదా రంగనాథుల కల్యాణం ప్రదర్శన..



డూ..డూ బసవన్న విన్యాసం



ద్వారకాతిరుమలలో గోదా శ్రీరంగనాథుల కల్యాణం జరుపుతున్న అర్చకులు

రమణీయం.. గోదా రంగనాథుల కల్యాణం

ద్వారకాతిరుమల/ ఏలూరు/ కాళ్ళ జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గోదా, శ్రీరంగనాథుల దివ్య కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీరంగనాథుని భక్తురాలైన గోదాదేవి ఈ ధనుర్మాస పర్వదినాలలో నెలరోజులపాటు పాసురాల ద్వారా స్వామివారిని కీర్తించి అనంతరం పరిణయమాడతారు. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ నిత్యకల్యాణ మండప ఆవరణలో నిత్య కల్యాణంతో పాటు గోదాదేవిన ఉంచి అర్చకులు కల్యాణతంతు ప్రారంభించారు. సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపచేశారు. భక్తుల గోవింద నామ స్మరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, అర్చకస్వాముల వేదమంత్రోచ్ఛరణల నడుమ మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘనంగా జరిపారు. జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరిలో గోదా రంగనాథుల కల్యాణం ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమారాచార్యులు రమణీయంగా నిర్వహించారు. వికాస తరంగిణి అధ్యక్షుడు రామ సత్య అప్పారావు , శ్యామలాంబ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మద్దాలి తిరుమల వెంకటేశ్వర్లు (బుజ్జి) దంపతులచే స్వామివారి కల్యాణ మహోత్సవం ఆలయ అర్చకులు వేద పండితులచే వైభవంగా జరిగింది. ఈవో అరుణ్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆత్మీయ కలయిక

వీరంతా సుమారు 25 ఏళ్ళ క్రితం పదవ తరగతి చదువుకున్నారు.. భోగి పండగ రోజున కాళ్ళ హైస్కూల్‌లో కలుసుకున్నారు. 1998-99 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం మీట్ అయ్యారు. ఆత్మీయ పలకరింపులతో ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానాలు చేసుకున్నారు. మరొకసారి కలుద్దామంటూ ఒకరికొకరు ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు. **- కాళ్ల**



కొబ్బరికాయ కొట్టి గ్రామోత్సవం ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు

మావుళ్లమ్మ గ్రామోత్సవం

భీమవరం టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మావుళ్లమ్మ జాతర ఉత్సవాలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సోమవారం ప్రారంభించారు. ఉదయం నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు తుటారాపు ఏడుకొండలు, లక్ష్మీ పార్వతీ దంపతులచే కలశస్థాపన, కుంకుమ పూజలను ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ చేయించారు. మధ్యాహ్నం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూల వాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తి ఉంచిన తరువాత ఎమ్మెల్యే అమ్మవారికి హారతులు ఇచ్చి కొబ్బరికాయ కొట్టి ఉత్సవం ప్రారంభించారు.



పెళ్ళికూతురు అమ్మవారికి బట్టలు పెడుతున్న దృశ్యం

వేడుకగా పెళ్లి కూతురమ్మ ఉత్సవాలు

ఆచంట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శేషమ్మ చెరువులో ఉన్న పెళ్ళికూతురు అమ్మవారి ఉత్సవాలు సోమవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పెళ్ళికూతురు అమ్మవారిని ఆచంట గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పెళ్ళి కూతురు, పెళ్ళి కుమారుడికి కల్యాణం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.





కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి , జంగారెడ్డిగూడెం గోకుల పారిజాతగిరి ఆలయాల్లో గోదా కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రేపు ద్వారకాతిరుమల శ్రీవారికి కనుమోత్సవం



మండపం సిద్ధం

ద్వారకాతిరుమల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో కనుమ మహోత్సవానికి దేవస్థానం సోమవారం ఏర్పాట్లు పూర్తిచేసింది. కనుమ మండపాన్ని పరిసరాలను సుందరీకరించారు. ప్రతీ ఏటా సంక్రాంతి పర్వదినాలలో కనుమ పండుగ నాడు చిన వెంకన్న ఉభయదేవేరులతో కలసి అట్టహాసంగా ఆ గ్రామానికి వెళ్తారు. ఏడాదికోరోజు తమ గ్రామానికి వచ్చే స్వామివారి కోసం ఆ గ్రామస్థులు నియమనిష్టలు, భక్తిప్రపత్తులతో ఎదురు చూస్తారు. కనుమ అయినప్పటికీ ఆ రోజు వీరు మాంసాహారాన్ని ముట్టరు. శ్రీదేవీభూదేవి సమేతంగా రాజధిరాజ వాహనంపై కొలువుదీరిన శ్రీవారు అక్కడకు చేరుకుని ప్రత్యేక పూజలు అనంతరం గిరిప్రదక్షిణగా ఆలయానికి చేరుకుంటారు.

పాపికొండలు పిలుస్తున్నాయి..

ఈ సంక్రాంతి సెలవుల్లో సరదాగా ఎక్కడికైనా టూర్ వెళదామంటే పాపికొండలు విహారం ఆహ్వానం పలుకుతోంది.. ఉరుకుల పరుగుల మధ్య అలసిన మనుసులకు ఇక్కడి ప్రశాంత వాతావరణం ఉపశమనాన్ని ఇస్తుంది.. సెల్‌ఫోన్ల గోల లేని వేరే లోకంలోకి తీసుకువెళుతుంది.. ఎత్తైన పర్వతాల మధ్య గలగలపారే గోదారి అందాలను బోటులో వెళుతూ చూస్తుంటే మనసు పరవశిస్తుంది.. అందుకే పాపికొండల పర్యటనకు ప్లాన్ చేయండి... పర్యాటకుల కోసం పాపికొండల పర్యటన పేరిట బోలెడన్ని వెబ్‌సైట్లు, ఏజన్సీలు ఉన్నాయి.

ఏలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) :పోలవరం ప్రాజెక్టుకి 40 కిలోమీటర్ల ఎగువన గోదావరి నది పరివాహక ప్రాంతంలో సహజ సిద్ధంగా ఏర్పడిన ఎత్తైన పాపికొండల మధ్య గోదావరి విహారం మంచి ఆనందాన్ని ఆహ్లాదాన్ని పంచుతుంది. ఇక్కడ ఎన్నో చూడదగ్గ ప్రదేశాలు ఉన్నాయి. పాపికొండలను దాటుకుని వెళితే నదీ తీరంలో స్వయంభువుగా వెలసిన పేరంటాలపల్లి శివక్షేత్రం.

సెలవుల్లో విహార యాత్ర

ఎత్తైన పాపికొండల నుంచి శివక్షేత్రం ప్రాంగణంలో నుంచి గోదావరిలోకి ప్రవహిస్తున్న సెలయేరు. మార్గమధ్యలో తొలుత పోలవరం ప్రాజెక్టు దిగువ కాఫర్ డ్యాం సమీపంలో స్వయంభువుగా వెలసిన మహానందీశ్వరస్వామి శివక్షేత్రం...పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యాం ప్రసిద్ధి చెందిన మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం... కచ్చులూరు , శివగిరి శివాలయాలు దర్శనమిస్తాయి. అంతే కాదండోయ్ బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగించిన మన్యం వీరులు అల్లూరి సీతారామరాజు ఆయుధాలు కొల్లగొట్టిన దేవీపట్నం పోలీస్ స్టేషన్ కూడా ఈ పర్యటనలో మనకు కనిపిస్తుంది. నదితీరాలకు ఇరువైపులా పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఖాళీ చేసిన గ్రామాలు నివాసాలు శిథిలమై ఆదివాసీ సంస్కృతికి అద్దంపడుతూ కనిపిస్తాయి. ఇక్కడ చెప్పుకోవడానికి ఇంకా విశేషాలు చాలానే ఉన్నాయండి. ఈ ప్రశాంత వాతావరణం చక్కని ప్రకృతి సోయగాలు చూడడానికి ఒక్క రోజు చాలదు . ఇక్కడ బస చేయడానికి అటవీశాఖ



ఏర్పాటు చేసిన చెక్క (ఉడెన్ హౌస్‌లు) సకల సౌకర్యాలతో మనకు నిత్యం స్వాగతం పలుకుతుంటాయి. ఎన్ని రోజులైనా పండక్కి వచ్చిన కొత్త అల్లుడిలా, రాక రాక వచ్చిన ఆత్మీయ బంధువుకి ఇచ్చే అతిథి మర్యాదలు మంచి బస, అన్ని రకాల రుచులతో జిహ్వకు స్వాంతన కలిగిస్తారంటే అతిశయోక్తి కాదండి. మరో విషయం గిరిజన గ్రామాలు ఖాళీ అయినా ఆయా ప్రాంతాల్లో కొన్ని చోట్ల గిరిజనులు వెదురుతో చేసిన కళాకండాలు , వెదురు బొంగులలో వండిన బొంగు చికెన్, బొంగు బిర్యానీలు పర్యాటకులకు ఆ మధుర స్మృతులను మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తాయి.

భీమవరంలో శోభన్‌బాబు జయంతి వేడుకలు


శోభన్ బాబు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సినిమా పరిశ్రమలో నటభూషణ్ శోభన్ బాబు నటుడిగా సూపర్ డూపర్ చిత్రాలను అందించారని, సినీ పరిశ్రమలో మైలురాయి అని అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి కన్వీనర్స్ భట్టిప్రోలు శ్రీనివాసరావు, పూడి శ్రీనివాస్, ఎం. సుధాకర్ బాబు, టి. వీర ప్రసాద్ అన్నారు. మంగళవారం శోభన్‌బాబు జయంతి సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పలువురు ప్రసంగించారు. 1975వ సంవత్స రంలో దేవుడు చేసిన పెళ్లి, అందరూ మంచి వారే, బాబు, జీవన జ్యోతి, బలిపీఠం, జేబు దొంగ, గుణవంతుడు, సోగ్గాడు వంటి చిత్రాలు అలరించాయని అన్నారు. శోభన్‌బాబు అభిమా నులు టి.సాయి కామరాజు, బి. బాలసుబ్ర హ్మణ్యం, యు. విజయ్, కుర్రా రాంబాబు, ఎస్. ఎన్. రావు, జి.జవహర్ బాబు, ధార సత్యనా రాయణ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి హెటిరో అధినేత సాయం

రూ. 50 లక్షలతో నిర్మించిన పాఠశాల డైనింగ్ హాలు ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన హెటిరో డ్రగ్స్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి

చింతలపూడి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆ పాఠశాలలో ఒక్క ఏడాదిపాటు హెటిరో డ్రగ్స్ అధినేత బండి పార్థసారథి రెడ్డి చదివారు. అదే ఆ జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి వరంగా మారింది. ప్రగడవరం గ్రామం జిల్లా పరిషత్ హైస్కూలులో తొమ్మిదవ తరగతి మాత్రమే ఏడాదిపాటు చదివిన పార్థసారథి రెడ్డి ఆ పాఠశాలపై అభిమానంతో పాఠశాల అభివృద్ధికి ఏది కావాలన్నా పూర్తి సహకారం అందిస్తారు. అయితే ఈ ఏడాది తన తల్లి బండి సోమకాంతమ్మ జ్ఞాపకార్థం పాఠశాలలో విద్యార్థుల కోసం సుమారు 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మల్టీపర్పస్ డైనింగ్ కం ఆడిటోరియం హాలును హెటిరో డ్రగ్స్ డైరెక్టర్ మోహన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. పాఠశాలలో అన్ని గదులకు మరమ్మతులు, రంగులు, కరెంటు, ప్రహరీగోడ, ఆవరణలో మొక్కలు వంటి పూర్తి అభివృద్ధి అందించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రగడవరం గ్రామస్తులు కొందరు గ్రామంలో కళ్యాణ మండపం, రామాలయం నిర్మించాలని అడిగారని, అందుకు పార్థసారథి రెడ్డి దృష్టికి తెచ్చి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఏఎంసీ అధ్యక్షులు జగ్గవరపు ముత్తారెడ్డి, చిలుకూరి జ్ఞానారెడ్డి, టి.చంద్రశేఖరరెడ్డి, గోలి రామకృష్ణారెడ్డి, ఎంఈవో కిరణ్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతుల్లాంటి గోతులు పూడ్చి చక్కటి రోడ్లు వేశాం

ఆకట్టుకుంటున్న ఎమ్మెల్యే మద్దిపాటి ఫ్లెక్సీలు



ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నల్లజర్ల, జనవరి13(ఆంధ్రజ్యోతి): నూతు ల్లాంటి గోతుల రోడ్లలో బస్సులేసుకొచ్చి మరీ ఓట్లేసెని సంక్రాంతి పండుగకు సొంతూరొచ్చే వారికి చక్కటి గోతులు లేని రోడ్లు వేసి చిరున వ్వులతో స్వాగతం పలుకుతున్న మద్దిపాటి వెంటక రాజు అంటూ ఏర్పాటు చేసిన సంక్రాంతి ఫ్లెక్సీలు ఆకట్టుకుంటున్నాయి. నియోజక వర్గంలోని పలు ప్రాంతాల్లో ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆరు నెలల్లోనే చంద్రన్న పాలనతో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని సూచిస్తూ ఎమ్మెల్యే మద్దిపాటి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై ప్రజలు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గం లో పల్లె పండుగ పేరుతో రూ.50కోట్లతో 85 పంచాయతీల్లో అభివృద్ధి పనులు, సామాజిక భద్రత పేరుతో రూ.130కోట్లతో 41,923 మందికి పింఛన్, సీఎం సహాయనిధి రూ2కోట్లతో 136 కుటుంబాలకు తక్షణ వైద్య సాయం, విద్యా వ్యవస్థ సమూల ప్రక్షాళన, విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, గ్రామ స్వరాజ్యం వంటి పథకాలను ఫ్లెక్సీల్లో ముద్రించారు.

బాలల సంరక్షణ అధికారి రాజ్‌కుమార్ ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఓ ఇంట్లో జిల్లా బాలల రక్షణ అధికారి(డీసీపీవో) కె.రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నారు. బొమ్మూరు పోలీసుల వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కె.రాజ్‌కుమార్ రాజమహేంద్రవరంలో ఐసీడీఎస్‌లో బాలల సంరక్షణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. భార్యతో మనస్పర్థలు వచ్చి కోర్టులో విడాకులకు అప్లై చేసుకున్నారు. ఈ క్రమంలో కుమారుడు కొద్దిరోజులు తండ్రి వద్ద, కొద్ది రోజులు తల్లి వద్ద వుంటున్నాడు. రాజమహేంద్రవరంలో ఉద్యోగం కావడంతో రాజ్‌కుమార్ సహోద్యోగులతో కలిసి హౌసింగ్ బోర్డు కాలనిలో ఒక రూమ్ అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. భార్య దూరమైనప్పటి నుంచి ఆయన మానసికంగా కుంగిపోయారు. ఈ క్రమంలో పండుగ సెలవులకు సహచరులు ఊరు వెళ్లిపోగా రాజ్‌కుమార్ ఒక్కరే రూమ్‌లో ఉన్నారు. సోమవారం కొయ్యలగూడెంలో నివాసం ఉంటున్న అతని తల్లికి ఫోన్ చేసి మాట్లాడారు. పిల్లాడిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పాడు. అటుపై రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బొమ్మూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజ్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

మూడు కేసుల నమోదు

ఏలూరు క్రైం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొమడవోలులో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వెయ్యి 50 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పరిధిలోని ఆండాలమ్మ తోటలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి కోడిపుంజు 1200 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో గుండాట నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 1100 రూపాయలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

వేడుకగా సంక్రాంతి సంబరాలు

పలు పోటీల్లో విజేతలకు ధర్మారావు ఫౌండేషన్ బహుమతులు అందజేత


భోగి మంటలు వెలిగిస్తున్న మంత్రి నిమ్మలతో ఎమ్మెల్యే పితాని తదితరులు



వ్యాపారవేత్త పడాల సురేశ్‌ను సన్మానిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దలు, పిల్లలు సాంప్రదాయ వస్త్రధారణలతో కుటుంబ సమేతంగా తరలి రావడంతో పట్టణంలోని బీఆర్ఎంవీఎం హైస్కూల్ గ్రౌండ్ పల్లెవాతావరణంతో పాటు సంక్రాంతి పండుగ కళ్లకు కట్టినట్టు ఆవిష్కృతమైంది. పల్లె కళారూపాలు, అబ్బుర పరిచే విధంగా ఉన్నాయి. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు సోమవారం రాత్రితో ముగిశాయి. మంత్రి రామానాయుడు 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ప్రతి ఏటా 11 ఏళ్ళుగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందించడం, విజేతలకు తిరిగి నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు ఇవ్వడం జరుగుతోంది. అదే విధంగా ఎమ్మెల్యే కప్ పేరుతో రాష్ట్ర స్థాయిలో మహిళలు, పురుషులకు బాలీబాల్ పోటీలు నిర్వహి స్తున్నారు. ఈఏడాది సౌత్ స్టేట్ లెవెల్‌పేరుతో ఇటీవల మరణించిన టీడీపీ నేత, ఆడిటర్ కలిదిండి రామరాజు పేరుతో టోర్నమెంట్ నిర్వహించారు. మంగళవారం సంక్రాంతి సంబరాల ముగింపు కార్యక్రమానికి మంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తదితరులు వేడుల్లో ఉత్సాంగా పాల్గొన్నారు. తొలుత హైస్కూల్ ప్రాంగణంలోకి మంత్రి, అతిథులు ప్రవేశించగానే గ్రామ దేవత విగ్రహాన్ని దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత శ్రీవారి విగ్రహం దర్శనం చేసుకున్నారు. ఇక సంక్రాంతి సంబరాల్లో ప్రభలు, భోగిమంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు, వివిధ రకాల సంక్రాంతి పిండి వంటలు, బొమ్మల కొలువులు, వంటి పలు సంక్రాంతిని ప్రతిబించే కార్యక్రమాలుఏర్పాటు చేశారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

కొయ్యలగూడెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని యర్రంపేట గ్రామంలో చోటు చేసుకున్నది. సోమవారం ఉదయం రోడ్డుపై వెళ్తున్న వృద్ధురాలు వామిశెట్టి సుబ్బలక్ష్మి (64)ని లారీ ఢీకొనడంతో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

మనవడిని హత్య చేసిన తాత అరెస్టు

నరసాపురం రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో మద్యం మత్తులో మనవడు చింతా నాగరాజును హత్య చేసిన తాత చింత ఆదినారాయణను సోమవారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై వెంకట సురేష్ చెప్పారు. శనివారం రాత్రి మద్యం సేవించి తాత మనవడు మిగిలి ఉన్న మద్యం బాటిల్ కోసం గొడవపడ్డారు. ఈ వివాదంలో మనవడిని తాత కత్తితో పొడిచి చంపిన విషయం విదితమే. సోమవారం తాతను అరెస్టు చేసి న్యాయమూర్తి కె శ్రీనివాస్ ముందు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

గుర్తు తెలియని మృతదేహం



ఏలూరు క్రైం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. దీంతో రైల్వే ఎస్ఐ పి.సైమన్ తన సిబ్బందితో సోమవారం సాయంత్రం నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సుమారు 50 నుంచి 55 ఏళ్ళ వయస్సు కలిగి ఉన్నాడు. 5.6 అడుగుల ఎత్తు కలిగి, చామనఛాయ శరీరంతో ఉన్నాడు. మృతుడు లేత బిస్కెట్ రంగు పొడవు చేతుల చొక్కా, నీలం రంగు కట్ బనీయన్, ముక్కుపొడెం డ్రాయర్ కలిగి ఉన్నాడు. మృతుని వివరాలు తెలియరాలేదు. ఏదైనా రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొని మరణించి ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్ఐ సెల్ నెంబర్ 9989219559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

పోలీసులకు బకాయిలు చెల్లింపుపై హర్షం



ఏలూరు క్రైం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ఉద్యోగులకు ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బకాయిలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. 2024 జనవరి నుంచి అడిషనల్ సరెండర్ లీవు శాలరీ బకాయిలు, జూన్ 2024 వరకూ సప్లిమెంటరీ సరెండర్ లీవ్ శాలరీ బిల్స్, జీపీఎఫ్, సీపీఎఫ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం తరపున, జిల్లా పోలీసు సిబ్బంది వారి కుటుంబ సభ్యులు తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

అల్లూరి స్మృతి వనంలో మ్యూజికల్ ఫౌంటేన్



భీమవరం టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జె.పి రోడ్‌లోని అల్లూరి సీతారామ రాజు స్మృతి వనం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.45 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన మ్యూజికల్ ఫౌంటేన్, బ్యాక్ డ్రాప్, లైటింగ్ సదుపాయాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ప్రధాని మోదీ అల్లూరి విగ్రహాన్ని, స్మృతి వనాన్ని ప్రారంభించారని, నూతన హంగులతో ఈ స్మృతి వనం రూపుదిద్దుకున్నదని అన్నారు. భీమవరం అభివృద్ధిలో ఇటువంటి సుంద రీకరణ ఎంతో ముఖ్యమని కలెక్టర్ అన్నారు. అలాగే భీమవరం పట్టణంలో ఇప్పటికే సుందరీకరణ పనులను, పార్కులు, ప్రముఖ కూడళ్ళు, పచ్చదనం అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, ఇప్పటికే కొన్ని పనులు పూర్తి చేసుకోవడం, కొన్ని పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్ర మంలో కంతేటి వెంకటరాజు, గాదిరాజు సుబ్బరాజు, సిహెచ్ కృష్ణంరాజు, డాక్టర్ రఘురామరాజు పాల్గొన్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

- సీపీఎం నాయకుల వినూత్న నిరసన
- ట్రూఅప్ చార్జీలు ఎత్తివేయాలని డిమాండ్


ఆకివీడులో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేస్తున్న దృశ్యం

పెనుగొండ/పాలకొల్లు అర్బన్/నరసాపురం రూరల్/ఇరగవరం/ఆకివీడు/ఏలూరు కార్పొరేషన్/బుట్టాయగూడెం/నిడమర్రు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కరెంటు బిల్లులు పెంచకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పెనుగొండ మండలంలోని పలు గ్రామాల్లో సీపీఎం నాయకులు విద్యుత్‌బిల్లులను దహనం చేశారు. ట్రూఅప్ చార్జీలు తీసివేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. సోమవారం పెనుగొండ, వడలి, సిద్ధాంతం, చినమల్లం, తామరాడ, సోమరాజుచెరువు గ్రామాల్లో సీపీఎం నాయకులు భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. పాలకొల్లులో సీపీఎం కార్యాలయం వద్ద భోగి మంటల్లో సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. నాయకులు జవ్వాది శ్రీనివాసరావు, చల్లా సోమేశ్వరరావు, గుబ్బల సత్యనారాయణ, వై అజయ్‌కుమార్, టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. నరసాపురం మండలం ఎల్‌బిచర్ల గ్రామంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లును దహనం చేశారు. పార్టీ నాయకులు రామ్మోహన్‌రావు, వాటాల ధనంజయ, ఆశిష్‌కుమార్ పాల్గొన్నారు. ఇరగవరంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భోగి మంటల్లో కరెంట్ బిల్లులను వేసి నిరసన చేపట్టారు. సీపీఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి, నాయకులు జుత్తిగ రామాంజనేయులు, గీత కార్మిక సంఘం కార్యదర్శి పాల సత్యనారాయణ పాల్గొన్నారు. ఆకివీడులో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్ఆర్‌పేటలోని సుందరయ్య గ్రంథాలయం వద్ద విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నగర కార్యదర్శి డి.ఎన్.వి.డి.ప్రసాద్, ఎ.రవి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, గుడిపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. బుట్టాయగూడెంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ బిల్లుల దహనం చేశారు. మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నిడమర్రులో సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. కోన శ్రీనివాసరావు, గవర మోహన్, గవర సత్యనారాయణ పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి రూ.కోటి పన్ను నోటీసు

జీఎస్టీ అక్రమ వినియోగం
అకౌంటెంట్‌పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

ముదినేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక చిరు వ్యాపారి జీఎస్టీ నంబరుపై అక్రమంగా పేబిల్స్ జనరేట్ చేసి ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ ఆ వ్యాపారి ఖాతాలను నిర్వహించే అకౌంటెంట్ మోసానికి పాల్పడిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం శ్రీహరిపురం గ్రామానికి చెందిన కూల్ డ్రింక్స్ వ్యాపారి పంచకర్ల విజయబాబు ఆదివారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ మోసపు సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తనకు జీఎస్టీ నంబరు కోసం గత ఏడాది మార్చి 23న విజయవాడకు చెందిన అకౌంటెంట్ బిల్లా కిరణ్‌కు వ్యాపారి విజయబాబు తన ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్ పోర్టు సైజు ఫొటో ఇచ్చారు. అప్పటి నుంచి తన వ్యాపారానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను అకౌంటెంట్ కిరణ్‌కు వ్యాపారి విజయబాబు ఫోన్‌లో చెప్పేవారు. రిటర్న్‌లు దాఖలు చేసే వారు. ఈ పరిస్థితుల్లో గత ఏడాది ఆగస్టు 3న సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ విజయ భాస్కర్ శ్రీహరిపురంలోని కూల్ డ్రింక్స్ షాపును తనిఖీ చేసి విజయబాబు జీఎస్టీ నెంబరుపై ఇప్పటి వరకు రూ.66.66 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయని తేల్చి ఇందుకు సంబంధించి సుమారు కోటి వరకు పన్ను చెల్లించాలని నోటీసు ఇచ్చారు. ఆ అధికారి ఇచ్చన నోటీసులపై దిగ్భ్రాంతికి గురైన వ్యాపారి విజయబాబు అంత పెద్ద మొత్తంలో వ్యాపార లావాదేవీలు చేయలేదని తెలిపారు. ఇదే విషయాన్ని స్థానిక సచివాలయ ఉద్యోగితో పంచనామా రిపోర్టు కూడా తయారు చేయించారు. తన జీఎస్టీ నంబరుపై కోట్లలో లావాదేవీలు అక్రమంగా నిర్వహించటంపై తన అకౌంటెంట్ కిరణ్‌ను గత ఏడాది నవంబరు 25న వ్యాపారి విజయబాబు అడగగా, తప్పు జరిగిందని పన్ను బకాయిలు చెల్లించే బాధ్యతను తానే తీసుకుంటానని కిరణ్ అంగీకరించాడు. అయితే ఇప్పటి వరకు అకౌంటెంట్ పన్ను కట్టకపోవటం, సేల్స్ టాక్స్ డీసీ పన్ను బకాయి చెల్లింపునకు ఇచ్చిన గడువు దాటిపోవటంతో వ్యాపారి విజయ్ బాబు ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో తనకు జరిగిన మోసంపై ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలపై దాడి
15 మంది అరెస్టు

పెనుగొండ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు చోట్ల కోడిపందేల బరులపై దాడి చేసి 15 మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు. వీరి వద్ద నుంచి 17 వేల నగదు, 4 కోళ్ళు, 4 కత్తులు, 2 గుండాట ఫ్లెక్సీలు, 12 డైస్‌లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



భీమడోలులో బరిలోకి సిద్ధంగా ఉన్న పందెం పుంజులు, హోరాహోరీగా తలపడుతున్న పుంజులు, ద్వారకాతిరుమలలో పందేలు



కత్తి దూసిన కోడి

గ్రామాల్లో జోరుగా కోడి పందేలు.. గుండాట.. జూదం



కామవరపుకోటలో గుండాట

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బుట్టాయగూడెం మండలంలో కోడి పందేలు జోరుగా సాగాయి. సోమవారం మధ్యాహ్నం వరకు అనుమతి లేదని మిన్నకున్న పందేల రాయుళ్లు మధ్యాహ్నం నుంచి కాలుదువ్వారు. పందెంకోళ్ల కాలికి కత్తికి కట్టి బరిలో దిగాయి. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో సంప్రదాయ కోడి పందేలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రారంభించారు. కుక్కునూరు: మండలంలో వేలేరు, చీరవల్లి, కుక్కునూరు, చివ్వాక, దాచారం తదితర ప్రాంతాల్లో కోడి పందేలు సాగాయి. వేలేరు కోడిపందేలకు తెలంగాణలోని భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు పట్నాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేలేరుపాడు మండలంలో అధికార, ప్రతిపక్షాలు వేర్వేరుగా కోడిపందేలు నిర్వహించారు. తెలంగాణ నుంచి పందెంరాయుళ్లు తరలివచ్చారు. పోలవరం మండలం గుంజవరం, గూటాల, కొత్త పట్టిసీమ, కన్నాపురం అడ్డరోడ్డు, ఎల్ఎన్‌డీపేట, పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద కోడి పందేలు యథేచ్ఛగా కొనసాగాయి. కామవరపుకోట మండలంలో కోడి పందేలు జోరుగా సాగాయి. ఉంగుటూరు మండలం కైకరం, నారాయణపు రం, బాదంపూడి, రాచూరు గ్రామాలలో బరులు వెలిశాయి. నిడమర్రు మండల తోకలపల్లి, ఫత్తేపురం, పెదనింద్రకొలను, ఛానమిల్లి, బావాయిపాలెం గ్రామాలలో కోడి పందేలు నిర్వహిం చారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో మూడు చోట్ల, శ్రీనివాసపురంలో రెండుచోట్ల, పేరంపేట, లక్కవరం, కేతవరం, వేగవరం, ఎ.పోలవరం తదితర గ్రామాలలో కోడి పందేలు నిర్వహించారు. లింగపాలెం మండలంలో కోడేపందేలతో పాటు గుండాట జోరుగా సాగింది. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం, వెంకటకృష్ణాపురం, పి కన్నాపురం, తిరుమలంపాలెం, గుణ్ణంపల్లి, తిమ్మాపురం, దొరసానిపాడు, ఎం.నాగులపల్లి తదితర గ్రామాల్లో కోడిపందేలు, కోతాట, గుండాట విచ్చలవిడిగా నిర్వహించారు. పెదపాడు మండలంలో కోడిపందేలు, కోసాటలో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. భీమడోలు మండలంలో కోడిపందేలు, కోసుపేకాట, జూదం యథేచ్ఛగా కొనసాగాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ, పోలసానపల్లి, అంబర్‌పేట, కురేళ్ళగూడెం గ్రామాల్లో కోడిపందేలు, పేకాట జూదం పెద్ద ఎత్తున్న నిర్వహించారు. చింతలపూడి మండలంలోని రాఘవాపురం, చింతంపల్లి గ్రామాల్లో యథేచ్ఛగా కోడి పందేలు జరిగాయి. పందేల ముసుగులో గుండాట, కోసాట, జోరుగా మద్యం ఏరులై పారింది. ఈ రెండు చోట్ల తెలంగాణ సరిహద్దు కావడంతో అధిక సంఖ్యలో పందెపురాయుళ్ళు కార్లు, మోటరు సైకిళ్ళు వేసుకుని అధిక సంఖ్యలో వచ్చారు. కొయ్యలగూడెం మండలంలో కోడిపందేలు యదేచ్ఛగా కొనసాగాయి. రామానుజపురంలో కోడిపందేలను ఎమ్మెల్యే, ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ పందేలు తిలకించారు. గవరవరం, రాజవరం, ఉంగుటూరు, దిప్పకాయలపాడు, కన్నాపురం, తదితర గ్రామాల్లో కోడిపందేలు యథేచ్ఛగా కొనసాగాయి. రామానుజపురంలో పందేలు తిలకించడానికి హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వంటి పలు పట్టణాల నుంచి, పలు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. పేకాట, గుండాట కూడా యథేచ్ఛగా కొనసాగాయి. పెదవేగి మండలం దుగ్గిరాల, జానంపేట, లక్ష్మీపురం, కూచింపూడి, వేగివాడ, న్యాయంపల్లి, విజయరాయి, బాపిరాజుగూడెం, పెదకడిమి తదితర గ్రామాల్లో భారీఎత్తున కోడిపందేలు నిర్వహించారు. తొలిరోజే కోట్లరూపాయల సొమ్ము చేతులు మారింది. హైదరాబాద్ వంటి నగరాలనుంచి పందేలరాయుళ్లు తరలివచ్చారు.



దుగ్గిరాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భోగి మంట



కొవ్వలిలో ఇళ్ల వద్ద గంగిరెద్దుల సందడి

ఉత్సాహంగా భోగి

గ్రామ ప్రధాన కూడళ్లలో భోగి మంటలు.. చిన్నారులకు భోగి పళ్లు



గంగిరెద్దు, డూడూ బసవన్నతో యువతులతో సందడి

బుట్టాయగూడెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోగి పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రధాన కూడళ్ల, గ్రామాల్లో భోగిమంటలు వేశారు.

- వేలేరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో భోగి పండుగ జరుపుకున్నారు. కూచిరాలలో క్రీడాపోటీలు, సంక్రాంతి సంబరాలు, మహిళలకు పోటీలు నిర్వహించనున్నారు.
- కామవరపుకోట: మండలంలోని గ్రామాల్లో భోగి సంప్రదాయబద్ధంగా జరిపారు. వేకువజామునే భోగి మంటలు వేశారు. సాయంత్రం చిన్నారులకు భోగి పండ్లు వేశారు. ఆలయాల వద్ద గోదా కల్యాణం నిర్వహించారు.
- ఉంగుటూరు: మండలంలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఆదివార తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. ఉప్పాకపాడు బాబా గుడి వద్ద, నారాయణపురంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.
- లింగపాలెం: మండలంలో తెల్లవారుజాము నుంచే భోగి మంటలు వేశారు. గంగి రెద్దులు, హరిదాసులు ఇళ్ల ముందు సందడి చేశారు.
- పెదపాడు: భోగి వేడుకలు వాడవాడలా సోమవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున యువకులు ముఖ్యకూడళ్ల వద్ద భోగి మంటలు వేసి సందడి చేశారు. పెదపాడులోని రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయం వద్ద గోదాదేవి కల్యాణాన్ని అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అర్చకులు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు.
- జీలుగుమిల్లి: నెర్సుగూడెంలో గారపాటి వారి ఇంట సంక్రాంతి సందడి కన్పించింది. గ్రామానికి చెందిన ఏడుగురు అన్నదమ్ములు కుటుంబ పెద్దల వారసులు నానమ్మ, అత్తయ్య, మేనత్తలు, వదినలు, మరదళ్లు, అక్కలు చెల్లెళ్ల, తోటి కోడళ్ల, తోడల్లుళ్లు, మనవలు, మనవరాళ్ల తో సంక్రాంతి ఘనంగా జరుపుకున్నారు.



సంక్రాంతి సంబరాల్లో ఎడ్లబండిపై సవారీ



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



కొవ్వలిలో ఆందోళన చేపట్టిన దళితులు

గ్రామ దీప్‌పై కొవ్వలి దళితుల నిరసన

దెందులూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పేద దళితులమైన తమను కొవ్వలి గ్రామానికి చెందిన గ్రామ దీప్ ఛైర్మన్ ఇబ్బందులకు గురిచేస్తుందని దళితులు సోమవారం ఆందోళన చేపట్టారు. కొవ్వలిలో 140 ఎకరాలు ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని గ్రామ దీప్ హైకోర్టును ఆశ్రయించారు. గ్రామంలో దళితులు అర ఎకరం చొప్పున 250 కుటుంబాలు 60 ఏళ్లుగా సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, తమ పొట్ట కొట్టవద్దని నినాదాలు చేశారు. గాంధీ నగర్‌లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామ దీప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాతి సంబరాల వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. పోలీసులు వారిని అక్కడ నుంచి పంపించి వేశారు. అనంతరం వారు కొవ్వలి ప్రధాన రహదారిపై నిరసన తెలిపి గ్రామ దీప్ ఛైర్మన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆందోళనలో దళితులు పెత్త ఎత్తున పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాల ముగింపు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ముగింపు సందర్భంగా నగరంలోని రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి, అగ్రహారం జనార్ధనస్వామి, పడమరవీధి వేంకటేశ్వర స్వామి, పవరుపేట వాసుదేవాలయాల వద్ద గోదా రంగనాయక స్వాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేద మంత్రోచ్చరణల నడుమ అశేష భక్తుల సమక్షంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

16న పాత పోలవరంలో కడమ్మ ఊరేగింపు

పోలవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పాత పోలవరం గ్రామ దేవత కడమ్మను సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 16 న గ్రామంలో ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి నైవేద్యాలు చీర సారె సమర్పించి పూజలు నిర్వహించుకునే భక్తులు అదేరోజు ఆయా కార్యక్రమాలు చేయాలని సూచించారు. సంక్రాంతి పండుగ రోజు గ్రామదేవత గ్రామ ఆడపడుచుగా ఇంటింటికి ఊరేగింపుగా వస్తుందని తెలిపారు.

బాల్య వివాహ నిరోధంపై ప్రచారం

భీమడోలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధంపై భీమడోలులో సోమవారం ప్రచారం నిర్వహించారు. చైల్డ్ మ్యారేజ్ జిల్లా కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో మైక్ ద్వారా ప్రచారం చేశారు. వయస్సు రాకుండా బాల్య వివాహాలు చేయకూడదని చట్టరీత్యా నేరమని, భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలు, రక్తహీనత, శారీరక సమస్యలు ఏర్పడుతాయన్నారు. బాల్య వివాహాలను నిరోధించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. పీహెచ్‌సీ వైద్యులు ఆనంద్, రాజా, ఆంజనేయులు, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండ్ ర్యాంకర్‌కు నగదు ప్రోత్సాహం

ఉంగుటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ రాష్ట్ర సెకండ్ ర్యాంకు సాధించిన హనుమంతు అజయ్‌రాజుకు మానవత సంస్థ రూ.10వేలు, మానవత మండల అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు రూ.10 వేలు నగదు ప్రోత్సాహకం సోమవారం అందజేశారు. అజయ్‌రాజు తండ్రి రంగారావును సత్కరించారు. పుప్పాల గోపి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, గంజి రవి, పుత్సకాయల విష్ణు, శీతాల సత్యనారాయణ, కోనే సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

ఏలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నక్క వెంకన్న (32) సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మృతి చెందినట్లు చక్రదేవరపల్లి సర్పంచ్ సాయిల సత్యనారాయణ తెలిపారు. వెంకన్నకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. వెంకన్న మృతికి ఉండవల్లి శ్రీను, వైట్ల ఆంజనేయులు, బేతి వెంకట రమణ, రాజేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపారు.




కైకలూరు శ్రీగోదారంగనాయకుని కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు.. పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

వైభవంగా గోదాదేవి కల్యాణం

కైకలూరు/ముసునూరు/ చాట్రాయి/ముదినేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కైకలూరు మీసాల వెంకటేశ్వరస్వామి ధనుర్మాస మహోత్సవాల సందర్భంగా గోదా రంగ నాథుని కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. సోమవారం స్వామి ఆలయంలో అలంకరించిన మండపంలో కల్యాణాన్ని మేళా తాళాల, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం పుర వీధుల్లో స్వామి ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముసునూరులో శ్రీభూదేవి, శ్రీదేవి సహిత వెంకటాచలస్వామి ఆలయంలో సోమవారం భోగి పర్వదినాన గోదాదేవి, రంగనాథ స్వామి వార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ దేవినేని వరప్రసాద రావు దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు వేదాంతం లక్ష్మీనరసింహచార్యులు, సాయి స్వామి వేదమంత్రోచ్ఛరణల మధ్య రేగుల చంద్రశేఖర్ రావు, రాణి దంపతులు పీటలపై కూర్చుని అమ్మవారి కల్యాణం చేశారు. చాట్రాయి సీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వడాలి సుభద్ర బలరామ సహిత జగన్నాథ స్వామి దేవస్థానంలో గోదాదేవి, జగన్నాథుని కల్యాణం వైభవంగా జరిగింది. పలువురు దంపతులు పాల్గొని కల్యాణాన్ని జరిపించారు. చేవూరు లక్ష్మీనారా యణ స్వామి దేవస్థానం, పెదగొన్నూరు రామాలయంలో గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు.


ముసునూరులో భోగి మంటలు

ఘనంగా భోగి వేడుకలు

కలిదిండి/కైకలూరు/ముసునూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోగి పండుగ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వీధుల్లో భారీ భోగి మంటలు వేశారు. నెలరోజులుగా ఇంటి ముందు వాకిట్లో పెట్టిన గొబ్బెమ్మల పిడకలను భోగి మంటల్లో వేశారు. చిన్నారులకు భోగి పండ్లు వేసి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఆశీర్వదించారు.ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం సాయిబాబు ఆలయంలో చిన్నారులకు సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారయణ భోగిపళ్ళు పోశారు.

సాయిబాబా నగర సంకీర్తన

మండవల్లి జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండవల్లి గ్రామంలో ధను ర్మాసం ఆఖరు రోజు సంద ర్భంగా సోమవారం షిర్డీసాయి బాబా భక్తబృందం నగర సంకీర్తన చేశారు. ప్రత్యేక వాహనంలో వేంకటేశ్వరస్వామి, షిర్డీసాయి ఉత్సవ విగ్రహాలతో వీధులలో శ్రీరామ, సాయి కీర్తనలు ఆలపిస్తూ భక్త బృందం వారు ఊరేగారు. మహిళలు అడుగడుగునా సాయిబాబాకు, వేంక టేశ్వరస్వామికి హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు.



'తెలుగు తమ్ముళ్ళు పత్రికలకు ఎక్కడం తగదు'

చాట్రాయి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ అధ్యక్ష పదవి నామినేటెడ్ విషయంలో నరసింహారావుపాలెం తెలుగు తమ్ముళ్ళు పత్రికలకు ఎక్కడం తగదని, ఇటువంటి తొందర పాటు చర్యలు పార్టీకి నష్టం కలిగిస్తాయిని మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ అధ్యక్షఉపాధ్యక్షులు యర్రా రమేశ్, గద్దల లక్ష్మణరావు, సోమవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు యర్రోజు రామ్‌ప్రసాద్ అన్నారు. నామినేటెడ్ విషయంలో భిన్న అభిప్రాయాలు ఉంటే పార్టీలో అంతర్గతంగా చర్చించి సరిదిద్దుకొనే అవకాశం ఉండగా కొందరు తొందర పడడం మంచి పద్ధతి కాదన్నారు.


నూజివీడు బరుల్లో కోడి పందేలు


ముదినేపల్లి మండలం పెయ్యేరు కోడిపందేల బరి వద్ద వాహనాలు


చాట్రాయి మండలం జనార్దనవరంలో కోడి పందేల్లో రద్దీ

కోడి పందేల జోరు

బరుల వద్ద గుండాట.. జూదం.. చేతులు మారిన లక్షలు

నూజివీడు/చాట్రాయి/ముసునూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ ముసుగులో కోడిపందేలు జోరుగా సాగాయి. నూజివీడు మండలం, పట్టణ ప్రాంతాల్లోని నూజివీడు ఎంపీడీవో కార్యాలయం వద్ద, గొడుగువారి గూడెం, మిట్టగూడెం, తుక్కులూరు తదితర ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించారు. స్క్రీన్లు వీడియోగ్రాఫీల నడుమ కోడి పందేలు సాగాయి. నూజివీడు పట్టణంలో నిర్వహించిన కోడి పందేలలో సినీ, జబర్దస్త్ నటులు పాల్గొని సందడి చేశారు. సినీ నటుడు శివారెడ్డి, జబర్దస్త్ టీమ్ సభ్యులు రాజు, దొరబాబు, హరితలతో పాటు, తెలంగాణలోని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మచ్చ నాగేశ్వరరావు, తెలంగాణ నీటి వనరుల శాఖ చైర్మన్ మువ్వా విజయకుమార్ తదితరులు నూజివీడులో కోడి పందేలు వీక్షించారు.

చాట్రాయి మండలంలోని చిత్తపూరులో భారీగా కోడిపందేలు నిర్వహించారు. కోసు ఆటలు, ఇతర జూదాలు నడిచాయి. పలావ్ సెంటర్లు, కూల్ డ్రింక్స్, తినుబండాల దుకాణాలు ఏర్పాటు చేశారు. మండలంలోని వివిద గ్రామాల నుండి చిన్నకార్లు ద్విచక్రవాహనాలలో జనం తరలివచ్చారు. ఇంకా చనుబండ, పోలవరంలలో మోస్తరుగా కోడి పందేలు జరిగాయి.

ముసునూరు మండలంలో సంక్రాంతి సంబరాల ముసుగులో తొలిరోజు భోగి పర్వదినాన కత్తికట్టి కోడిపందెలు జోరుగా సాగాయి. గోపవరం, చెక్కపల్లి గ్రామాల్లో బారీగా ఏర్పాటు చేసిన బరుల్లో ఉదయం ప్రారంభమైన కోడిపందేలు పేడ్‌లైట్లు కాంతుల్లో రాత్రి 1గంట వరకు కొనసాగాయి. బరులు వద్ద గుండాట, జూదం యథేచ్ఛగా కొనసాగాయి.


కైకలూరు బరిలో కత్తులు దూసిన పందెం కోళ్లు

ముదినేపల్లి/కలిదిండి/మండవల్లి/కైకలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో కోడిపందేలు యథేచ్ఛగా ప్రారంభమయ్యాయి. బొమ్మినంపాడు, సింగరాయపాలెం, వడాలి, పెయ్యేరు గ్రామాల ఏరియాల్లో పెద్ద బరులను ఏర్పాటు చేశారు. తొలి రోజున మండలంలో సుమారు రూ2.50 కోట్లు పందేల రూపంలో చేతులు మారినట్లు తెలుస్తోంది. పందేల బరుల వద్ద పేకాట, గుండాట ఇతర జూదాలు కూడ పెద్ద ఎత్తున జరిగాయి. కలిదిండి మండలం గుర్వాయిపాలెంలో భారీ బరి ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కోడిపందెం రూ.5 లక్షల నుంచి 7 లక్షల వరకు వేశారు. పోతుమర్రు, ఎస్.ఆర్పీ అగ్రహారం, తాడినాడ, పెదలంక, కొండంగి గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. బరుల వద్ద కోడిపందేలతోపాటు కోత ముక్క, గుండాటలు నిర్వహించారు. కైకలూరు మండలంలోని ఆటపాక, భుజబలపట్నం, కొట్టాడ, పందిరిపల్లిగూడెం, గుమ్మళ్లపాడు, శృంగవరప్పాడు, రాచపట్నం, ఆచవరం గ్రామాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహించారు. భుజబలపట్నం గ్రామంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు.


ముసునూరులో కోడి పందేల బరి


కలిదిండిలో కోడి పందేల జోరు


కైకలూరు మండలం శృంగవరపుపాడులో గుండాట

చిరు వ్యాపారికి పన్ను రూ.కోటి

అకౌంటెంట్ అక్రమ లావాదేవీలు.. పోలీసులకు ఫిర్యాదు

ముదినేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక చిరు వ్యాపారి జీఎస్టీ రూ.కోటి చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. వ్యాపారి జీఎస్టీ నంబరుపై అక్రమంగా పే బిల్స్ జనరేట్ చేసి అతడి అకౌంటెంట్ అక్రమ లావాదేవీలతో మోసానికి పాల్పడ్డాడు. శ్రీహరిపురం గ్రామానికి చెందిన కూల్ డ్రింక్స్ వ్యాపారి పంచకర్ల విజయబాబు ఆదివారం రాత్రి దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తనకు జీఎస్టీ నంబరు కోసం గత ఏడాది మార్చి 23న విజయవాడకు చెందిన అకౌంటెంట్ బిల్లా కిరణ్‌కు వ్యాపారి విజయబాబు తన ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్ పోర్టు సైజు ఫొటో ఇచ్చారు. అప్పటి నుంచి తన వ్యాపారానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను అకౌంటెంట్ కిరణ్‌కు వ్యాపారి విజయబాబు ఫోన్‌లో చెప్పేవారు. రిటర్న్‌లు దాఖలు చేసేవారు. గత ఏడాది ఆగస్టు 3న సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ విజయ భాస్కర్ శ్రీహరిపురంలోని కూల్ డ్రింక్స్ షాపును తనిఖీ చేసి విజయబాబు జీఎస్టీ నెంబరుపై ఇప్పటివరకు రూ.66.66 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయని తేల్చి ఇందుకు సంబంధించి సుమారు కోటి వరకు పన్ను చెల్లించాలని నోటీసు ఇచ్చారు. ఆ అధికారి ఇచ్చిన నోటీసులపై దిగ్భ్రాంతికి గురైన వ్యాపారి విజయబాబు అంత పెద్ద మొత్తంలో వ్యాపార లావాదేవీలు చేయలేదని తెలిపారు. ఇదే విషయాన్ని స్థానిక సచివాలయ ఉద్యోగితో పంచనామా రిపోర్టు కూడా తయారు చేయించారు. తన జీఎస్టీ నంబరుపై కోట్లలో లావాదేవీలు అక్రమంగా నిర్వహించడంపై తన అకౌంటెంట్ కిరణ్‌ను గత ఏడాది నవంబరు 25న వ్యాపారి విజయబాబు అడగగా, తప్పు జరిగిందని పన్ను బకాయిలు చెల్లించే బాధ్యతను తానే తీసుకుంటానని కిరణ్ అంగీకరించాడు. అయితే ఇప్పటి వరకు అకౌంటెంట్ పన్ను కట్టకపోవటం, సేల్స్ టాక్స్ డీసీ పన్ను బకాయి చెల్లింపునకు ఇచ్చిన గడువు దాటిపోవటంతో వ్యాపారి విజయ్ బాబు ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో తనకు జరిగిన మోసంపై ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం


భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కలిదిండి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సోమవారం భాస్కరావుపేట, మూల్లంక, సానారుద్రవరం, కోరుకొల్లు గ్రామాల్లో సీపీఎం నాయకులు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కలిదిండి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి శేషపు మహంకాళి రావు మాట్లాడుతూ ఎప్పుడో వాడిన విద్యుత్ బిల్లులకు ఇప్పుడు చార్జీలు వసూలు చేయటం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచి అదాని లాంటి కార్పొరేటర్లకు లాభం చేకూర్చటం మానుకోవాలని డిమాండ్ చేశారు.

కోడిపందేలు, పేకాట శిబిరాలపై దాడి

కలిదిండి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందేలు, పేకాట శిబిరాలపై పోలీసులు సోమవారం దాడి చేశారు. 45 మందిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.31 వేల నగదు, 8 కోడి పుంజులు, 10 కత్తులు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. 5 గుండాట బోర్డులను సీజ్ చేశామన్నారు.

తాగునీరు పైప్‌లైన్ లీకేజీ



మండవల్లి జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మెయిన్ సెంటర్లో రహదారి పక్కన రక్షిత నీటి పైపులైను లీకై తాగునీరు వృథాగా పోతోంది. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పాత, కొత్త పైపులైన్ల జాయింట్ లీకై నీరు వృథాగా డ్రెయినేజీలో పోతుంది. పైపులైను లీకేజీ వల్ల స్టేషన్‌రోడ్డు వాసులకు సరిగా నీరు అందటం లేదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కరరావు, జిల్లా కన్వీనర్ అప్పారావు వాపోయారు.


బొమ్మినంపాడు జడ్పీ హైస్కూలులో పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ముదినేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వారంతా రెండు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్నారు. ఎక్కడెక్కడో వృత్తి, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. సంక్రాంతి సందర్భంగా వారంతా కలిసి నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అప్పుడు చదువుకున్న పాఠశాలలో రోజంతా ఉత్సాహంగా గడిపారు.

బొమ్మినంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2003 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు సోమవారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వారు విచ్చేశారు. చదు వుకున్న రోజుల్లోని పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడి పారు. అప్పటి హెచ్ఎం విశ్వేశ్వరరావు, పీఈటీ రవి కుమార్‌తోపాటు పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. హైస్కూలు ఎస్ఎంసీ చైర్మన్ అల్లాడ సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు కేసం ప్రసాద్ పాల్గొన్నారు.